
# భార్యాభర్తలెలా వుండాలి?



అరిగె రామారావు

నేను లోగడ ఈ పత్రికలో 'భార్యలెలా వుండాలి? 'భర్తలెలా వుండాలి?' అనే కథలు రాశాను. వాటిని మీలో చాలమంది చదివి వుండి వుంటారు—మీరు 'పత్రిక'కు రెగ్యులర్ పాఠకులయితే! ఆ కథలను చదివిన నా స్నేహితులు చాలమంది, 'భార్యాభర్తలెలా వుండాలి?' అనే కథను కూడ రాయమని అడిగారు. పోతే యిక్కడ మీకో చిన్నవిషయం మనవి చేయవల్సి వుంటుంది. ఆమొదటి రెండు కథలకు సంబంధించిన (కథా) వస్తుసామగ్రిని వాతావరణాన్ని ఎక్కడ్నుంచి సంపాదించానను కున్నారో తెలుసా? సాక్షాత్తు మా 'స్వర్గసీమ' నుండే! పూర్తిగా స్వానుభవం కాదు సుమండీ! ఏదో ఒకానొక చిన్నసంఘటన, చిన్న అనుభవం, చిన్నసైజు ఎక్స్‌పెర్‌మెంట్—వీటి మీద అల్లిన అల్లికమే ఆ కథలు!

సరే ఎన్నాళ్లగానో రాయాలనుకుంటున్న, ఈ కథకు కావల్సిన 'ముడిసరుకు' కోసం కొన్ని రోజులుగా మా స్వర్గసీమలో 'త్రవ్వకం పని' ప్రారంభించాను. ఏ త్రవ్వకానికయినా త్రవ్వవల్సిన ప్రాంతంలో ముగ్గు అంటూ వేస్తారు కదా!, ఆ ముగ్గు ఒక శనివారం రాత్రి తొమ్మిదిన్నర గంటలకు వేశాను.

* * *

ఆ రోజు రాత్రి మొదటాట సినిమా చూచి ఎందుకో తెలియని హుషారులో వూగిపోతూ యింటి కొచ్చాను. సైకిలు వరండాలో పెట్టి తాళం వేశాను. సన్నగా ఈల వేసుకుంటూ లోపలి అడుగుపెట్టాను. లోపల శ్రీమతిని చూడగానె నా ఈల ఆగిపోయింది. గుమ్మం దాటే ప్రయత్నంలో వున్న నా కుడికాలు వెనుకంజ వేసింది—మా శ్రీమతి తలనిండా మల్లెపూలతో, తెల్లచీరతో, ముందుకు పడ్డ నల్లజడతో, ఏదో పుస్తకం చదువుతూ, వంద క్యాండ్ల బల్బు వెలుగులో, మెరుస్తూ, మైమరుస్తూ, నేనప్పుడే చూచి వస్తున్న సినిమాలోని హీరోయిన్ లాగా ఎప్పుడూ లేనంత అందంగా వుంటే—ఆదృశ్యం చూచి నా ఈల ఆగిపోయి వుంటుందని మీరనుకొని వుంటారు కదూ! అప్పుడయితే మీరు నిలువునా ఫెయిల్ అయ్యారన్నమాట!

అప్పుడామె మీరనుకున్నట్లుగా లేదు. మరెలా వుంది?

గదికి ఒక మూలగా చింకి చాప మీద గోడ కానుకుని జారిగిలబడి కూర్చుంది. పాతచీర, రేగిన జుత్తు. బొట్టులేని నుదురు. కాటుకలేని కళ్ళు, ప్రక్కనే కిలుంపట్టిన ఒకచెంబు, ఇత్తడిగ్లాసు, చేతికందుబాటులో, పదోసారో పదిహేనోసారో చదివిన ఆర్నెల్ల క్రితం పాత పత్రికలో మిగిలిన ఇరవైమూడు పేజీలు. వాల్గోరోజు స్నానం తర్వాత తడపటానికి వీలుగా వుండే ఒక మురికి పాత, ఒక మకిలిదిండు—అదీ సార్, అప్పటి ఆమె పోజు!

నన్ను చూడగానే ఆ పెద్దకళ్ళలోకి కొత్త నెత్తురు వూరింది. కోపాన్ని, తిరస్కారాన్ని, సూచించే ఒకవిధమైన మూల్గు శబ్దం వినిపించింది. (ఏవిధమైన అంటె నేను స్పష్టంగా, మీకర్ధమయ్యేలాగా చెప్పలేను. ఎవరికివారు స్వానుభవం మీద తెలుసుకోవల్సిన ఒకానొక వింత శబ్దం. సందర్భానుసారంగా ఆ శబ్దం అందమైనదిన్నీ అతి భయంకరమైనదీన్నీ) చాల స్పీడుగా ఇరవైమూడు పేజీల పాత పత్రికను చేతిలోకి తీసికొని దానిలోకి తన వేడికళ్ళ చూపులను వాడిగా, గ్రుచ్చింది. అయినా కొనకంటి చూపులు నన్ను వేడివేడిగా తాకుతూనే వున్నాయి.

ఆ చూపుల తాకిడికిగాని నేను ప్రస్తుతానికి రాలేదు. అప్పుడే చూచి వస్తున్న సినిమాలోని హీరోయిన్ కళ్ళు, నవ్వూ నాస్మృతిపథంలో అలుక్కుపోలేదు. అప్పటికిగాని సినిమాహాలులో ఫస్ట్‌క్లాసులో నాముందు వరుసలో కూర్చున్న కాలేజి అమ్మాయిల జడల్లోని పూలవాసన, వంటిసెంటు, గుసగుస నవ్వులు నా గుండెల్లోంచి జలుబునీళ్లలా జారిపోలేదు.


అప్పటికిగాని మా శ్రీమతి మూడురోజుల క్రితం 'ఎర్రజెండా' ఎగుర వేయుటం, పాయింత్రం ఆఫీసు నుండి వచ్చిన తర్వాత నేను కందిపచ్చడి

# భార్యా భర్త లెలా...

చారు చేయటం, వంటయిన తర్వాత స్నానం చేసి రేపు వుదయంకు కూరలు తీసుకురావటానికి సంచి తీసుకుని సైకిలు వేసుకుని ఒక్కయిదు నిమిషాలల్లో వస్తానని శ్రీమతికి చెప్పి బజారు వెళ్ళటం, బజారులో నేను చూడదల్చుకున్న సినిమా ఆరోజు ఆఖరాటని తెల్సుకుని, వెళ్ళలేని నా అసహాయ స్థితిని తల్చుకుంటూ (యింటి దగ్గర శ్రీమతి 'రెడ్‌వీక్' లేక 'ఎర్రవారం' కారణంవల్ల!) గోడ మీద బొమ్మలయినా తనివిదీరా చూద్దామని చూస్తుండగా కాలేజి అమ్మాయిల గుంపొకటి నా ముందుగా సువాసనలో, నవ్వులతో నడిచి ఫస్ట్‌క్లాస్ బుక్కింగ్‌లో టికెట్స్ తీసికొని బిలబిల బాల్కనీమెట్లు ఎక్కటం, వాళ్లను చూచి మంత్రముగ్ధుడైనట్లుగా నేనూ టికెట్ కొనుక్కొని వాళ్ళ వెనుక వెళ్లి, వాళ్ళ వెనుక వరుసలో కూర్చోవటం, ఇంటర్‌వెల్‌లో మిరపకాయ బజ్జీలు కొనుక్కొని తినటం— ఇవన్నీ శాపవిముక్తి పొందుతున్న వాడికి, మతిభ్రమణం తొ(క)లుగుతూ వున్న వాడికి, 'స్మృతివినాశిని' ప్రయోగింపబడిన దాని మహిమ జారుతూ వున్న వాడికి పూర్వస్మృతి కలిగినట్లుగా, నా కండ్ల ముందు మెదిలాయి.

అప్పుడు మెల్లగా, "సారీ కాముా!" అన్నాను. ('కాము' అన్నది 'కామాక్షి' అన్న పేరుకు కుదింపు! మా ఆవిడ పేరు కామాక్షి కాదు. అసలు పేరు వేరే వుంది. ఆ పేరే గనుక రాస్తే, "ఔరా, నన్ను మీ కథల్లోకి కూడ లాగుతున్నారా?" అని గుగ్గిలం మీదపడ్డ అగ్గిలాగా గగ్గోలు చేసేయుగలదు. అందుకని ముందు ముందు కామాక్షి లేక కాము అని వ్రాయదల్చుకున్నాను.)

లుంగీ కట్టుకుని దొడ్లోకి వచ్చాను. మూడు రోజుల నుండి పూలుకోయక పోవటం వల్ల నన్నజాజి పందిరి నిండుగా తీవిగా ఇందాక సినిమా హాలులో చూచిన కాలేజి అమ్మాయి లాగా—వుంది.




ఆ అమ్మాయి పేరు వాణి. అలా అని మిగతా అమ్మాయిలు పిలవగా విన్నాను. ఆవాణి సరిగ్గా నా ముందు సీట్లోనే కూర్చుంది. ఎంతో ఏపుగా చూచేవారికి కైపు ఎక్కించేటట్లుగా వుంది. ఆపిల్ల చల్లగుండా సినిమా చూస్తున్నంతసేపూ ఒకటే నవ్వు. ఆ నవ్వు ఏం నవ్వోగాని!

ఆ పిల్లను, ఆ పిల్ల బారు జడను, గుండ్రని భుజాలను తల్చుకుంటూ కామాక్షికి దొడ్లో విస్తరి వేసి అన్నం వడ్డించాను.

లోపలికి వచ్చి, 'అన్నం వడ్డించా రా కామూ!' అని పిలిచాను. పాపం ఆకలి మీద వున్నదేమో పిలవగానే ఏమీ సణగకుండా లేచి వచ్చింది.

తలవంచుకుని మౌనంగా కలుపుకు తింటుంది. ఆమెను మాటాడించాలని, "ఇంకాస్త కందిపచ్చడి వెయ్యమంటావా?" అని అడిగాను.

"అఖ్ఖర్లా—" అంది.

నాలుగు ముద్దలు కడుపులో పడగానే లోపలి ఆకలిమంటతో పాటు కోపం కూడ చల్లారినట్లుంది చారన్నం కలుపుకుంటూ ప్రసన్నవదనంతో "ఏ సినిమా కెళ్లారు?" అని అడిగింది.

"చిక్కడు—దొరకడు"

సినిమా పేరు వినగానే తల యెత్తి నా వంక చూచి ఎడమచేతితో నుదురు కొట్టుకుంటూ, "కర్మ, మీరీ స్టంట్ సినిమాలు మానరు కదా?" అంది.

నేను వెంటనే అందుకుని, "స్టంట్ మాత్రమేనా? బోలెడు రొమాన్సు—" అని ఇంకా చెప్ప బోతుండగా మధ్యలో, "మీ రొమాన్సు తీసికెళ్లి తగలెట్టండి—" అంది, కొద్దిగా కోపం, మరికొంత హ్యూమర్ మిళితం చేస్తూ.

నా కెందుకనో ఆ కాలేజి పిల్ల వాణి రూపం పూరితే కళ్ళముందు మెదులుతూ ఏదో వికారం లాటి దాన్ని కలిగిస్తుంది.

"నా బొంద అంతగా వెళ్లి సినిమా ఏమీ ఎన్జాయ్ చేయలేదు." అన్నాను.

"ఏమో?"

"నా ముందు వరుసలో కాలేజి అమ్మాయిల పటాలం వకటి కూర్చుంది."

"అయితే వాళ్లను చూస్తూ కూర్చున్నారా?"

"కరక్ట్ కామూ! వాళ్లల్లో వాణి అనే అమ్మాయి వుంది. ఆ అమ్మాయి సినిమా చూస్తున్నంతసేపూ నవ్వింది నవ్వినట్లే వుంది. ఒకటే నవ్వు, గోలా! ఇక నా బొంద సినిమా ఏం చూస్తాను?"

"ఓహో, అయితే పేరు కూడ కనుక్కున్నారన్న మాట."

—ఈ మాట అంటుండగా నా భార్య మొగంలో ఏదో కళ దిగజారుతున్నట్లు, ఏదో సన్నని నీడ అలముకుంటున్నట్లనిపించింది. ఆ నీడ ఏమిటో ఆ నీడ వెనుక కామాక్షి ఆలోచనల జాడ ఏమిటో నాకు వెంటనే అర్థమయింది. ఒక భావం సన్నటి రేఖలాగా నాలో మెదిలింది. కామాక్షి పూర్తి రియాక్షన్ కనిపెట్టితే నేను రాయాలనుకుంటున్న కథకేదయినా 'ముడిసరుకు' దొరుకుతుందని పించింది. అలా అనిపించగానే ఇందాక చెప్పానే

**1968 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డుమీద ఏదే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలలో జరుగు



ముఖ్య సంఘటనల అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, సర్వీసులో ప్రమోషన్‌కు ట్రాన్సుఫరు, పిల్లల జననం, వివాహం సుఖ సంతోషాలు మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజిఅదనం ఒకదపామా చినత్సపి పెందగలరు.

PT. DEV DUTTI SHASTRI
Raj Jyotshi, (MAP) P. B. 86,
JULLUNDUR CITY.






ఆంధ్రప్రదేశ్ అన్ని ముఖ్య నగరాల లోను మా ఏజెంట్లు కలరు.
మద్రాసు, బళ్ళారి, హాస్పేట, బరంపురం, కటక్, ఖర్గపూరు, కలకత్తా, జంషెడ్‌పూరు, సింద్రీ, ఏన్‌బాద్, నాగపూర్‌లలోను మా ఏజెంట్లు కలరు

PRABHAT


# భార్యాభర్తలెలా...

'ముగ్గు'—ఆ ముగ్గు వెయ్యటం మొదలుపెట్టాను.

"నిజంగానే ఆ సుందరి కడుసుందరి కామూ! ఇంటర్‌వల్‌లో చూశా, ఎంత బారుజడ అనుకున్నావ్?"

"నేను ఏమీ అనుకోలేదు—" తకీమని సమాధానం వచ్చింది..

వచ్చిన ఆ సమాధానాన్ని లెక్కచేయని ధోరణిలో అన్నాను: "పుత్తడిబొమ్మ బారేనా? అరచేయి అంత వెడల్పు. అదేం ఫేషనోగాని సన్నజాజి దండలు అందరూ జడ పాయల్లోంచి పెట్టుకుంటారా, ఈ పిల్లేమో ముచ్చిన గుంటల్లోంచి పడినెత్తి మీదుగా పెట్టింది. మరి ఈ రోజుల్లో 'కాలేజీల్లో చదువులే నేర్పుతున్నారో ఫాషన్సే నేర్పుతున్నారోగాని. ఆ జాకిట్—అదేం జాకిట్టో, ఎంత బిగుతుగా, ఎంత పొట్టిగా బొమ్మ రెవిక లాగా వుందో! జాకిట్ చేతులు ఎంత కురుచగా వున్నాయని— చేతుల మీద చిన్నప్పుడేయించుకున్న టీకాల మచ్చలు కూడ కనిపిస్తున్నాయి. ఆ జాకిట్‌లోంచి బ్రా— అదేదో ఫారెన్ సెంటు—వ్వ్, నా బొంద ముందు అలాటి సుందరి కూర్చుంటె ఇక కళ్లు తెర వైపుకు మళ్లుతాయా? నీవే చెప్పు—"

ఈ మాటలు పూర్తి అయ్యేలోపల కామాక్షి కూరన్నం పెట్టించుకుని మజ్జిగ పోయించుకోవటం, భోజనం పూర్తి చేయటం, ఎంగిలి చేయి కడుక్కొని మంచినీళ్లు పోయించుకుని త్రాగి, తడిచేయి, మూతి పమిట చెంగుకు తుడుచుకుంటూ లోపలికొచ్చి తన చాప మీద పండుకోవటం—అన్నీ జరిగిపోయాయి. నేనాపె వెనకాలే ఎటు వెళ్లితే అటు వెళ్లుతూ పై మాటలన్నీ చెప్పాను.

కామాక్షి మధ్యలో నోరుమెదపి ఒక్కమాట కూడా అనలేదు. నేను కామాక్షి మొగంలో మారుతున్న రంగులను అతి నిశితంగా కనిపెట్టుతూనే వున్నాను. ఏదో తెలియని ఆనందం నాగుండెల్లోకి జారుతుంది.

నేను కూడ భోంచేయటానికి లోపలికెళ్లాను. మళ్ళీ వెంటనే ఏదో గుర్తుకు వచ్చినట్లుగా లోపలికి వచ్చి సీరియస్‌గా, "అన్నట్లు కామాక్షి చెప్పటం మర్చిపోయాను. వాణిది నొక్కులజుట్టు తెలుసా!" అన్నాను.

చాపమీద బోర్లా పండుకున్న కామాక్షి కళ్లు సగం పైకెత్తి, "మర్చిపోయినంత మాత్రాన కొంప లేవీ మునుగుకు పోలేదు గాని వెళ్లి భోంచేయండి" అంది కోపంగా. ఆ అనటంలో ఎంత అందం! ఆకళ్లల్లో ఎంత జెలసి! అసూయతో కూడుకున్న కోపంతో ఆమొగంలో ఒకవింత అందం మెరిసింది. అలాటి అందం కామాక్షి మొగంలో మా పెళ్లయిన యీ మూడునాలుగు సంవత్సరాల్లో ఎప్పుడూ చూడలేదు. ముడిపడ్డ కనుబొమ్మలు, చిక్కపడ్డ కొనకంటి చూపులు, మొగంలో తారట్లాడే సన్నటినీడలు— హాయ్— హాయ్—నాకిదొక కొత్త అనుభవం! ఏదో గర్వం! దీన్నిబట్టి తెల్సుకున్నదేమిటంటె, మనసొంత పెళ్ళాల దగ్గర పరాయి ఆడవాళ్ల అందంగురించి పొగిడితే వాళ్లకు అసూయ, మంట...... ఇంకా, ఇంకా? ఏమో తెలియదు. చూడాలి. వేచి చూడాలి. ఈ విషయం మీద గొప్ప ఎక్స్‌పెర్‌మెంటుచేయాలి. కొత్తకథకు కొత్తప్లాట్! దీనిమీద దర్జాగా ఒకకథ రాసిపారేయవచ్చు—

ఇదిచాల "లైట్‌డోస్" ఇంకా ఘాటుడోసురిస్తేగాని, మనకథకు కావల్సినంత ప్రమాణంలో 'ముడి సరుకు' దొరకదు. రైటో— అనుకున్నాను. అన్నం తినటానికి ప్రుపక్రమించాను.

* • *

రెండురోజుల తర్వాత వచ్చిన పుదయంపూట ఆరున్నర గంటల సమయంలో అప్పుడేవచ్చిన దిన పత్రిక పేజీలు తిరగవేస్తూ బయటరోడ్డు వంపు చూశాను. ఒక తుడుపుపిల్ల' (రోజూ మామూలుగా మనం వాడేమాట రాతల్లో వ్రాయకూడదేమో! అందుకని 'తుడుపుపిల్ల' అందాము—) రోడ్డు వూడుస్తుంది. టవునుల్లో రోడ్లు తుడిచే ఆడవాళ్లు పుదయంపూట ఎంత మేకప్‌లో పనిలోకి వస్తారో మీరూ చూస్తూనే వుంటారు. ఈపిల్లలో కేవలం అలంకరణేకాక అందం, దానితోవయస్సు వుంది. (ముదురు వయస్సుకాదు!) రోజూ ఇదే సమయానికి మావీధి వూడవటానికి వస్తుంది. పాపం, వాళ్లు చేసే పనిలోని న్యూనతను కప్పిపుచ్చుకోవటానికి ఇంత అతిగా అలంకరించుకుంటారేమోననుకుంటూ నేను రెప్పవేయకుండా రోడ్డువంకా, ఆ పిల్ల వంకా చూస్తూవున్నాను.

అదేసమయంలో కామాక్షి కాఫీగ్లాసుతో వస్తూ నేనంత తీక్షణంగా చూస్తున్నవయిపు తనూచూచింది. కాఫీ గ్లాసు అందుకుంటుండగా నేను వ్రాయదల్చుకున్న కథ, మాఆవిడ మీద ప్రయోగం నా మనస్సులో మెదిలాయి. అప్పుడు ఇలా అన్నాను:

"చూడు కామాక్షి. ఆపిల్ల ఎంత అందంగా వుందో, ఆ మేకప్, ఆ అందాన్ని చూస్తే ఎవరయినా రోడ్లూడ్చే పిల్ల అని అనుకుంటారా? సినిమాస్టార్ లాగా వుంది కదూ! ఏదయినా సినిమా అవుట్‌డోరు షూటింగు జరుగుతుందేమోనను కుంటారు కదూ!"

"ఇకనేం, మీరూ ఒక చీపురుతీసికుని దాన్తోపాటు రోడ్డు వూడవండి. మిమ్మల్నీ ఏ సినిమా హీరో అనో అనుకుంటారు చూచేవాళ్లు—" అని కామాక్షి గిరుక్కున వెనక్కి తిర్గి విసురుగా లోపలికెళ్లిపోయింది.

అలా విసురుగా వెనక్కి తిరగటంలో, మెడవిసిరేసి ముందుకు దూసుకు పోవటంలో ఏదో అందం, నా గుండెలనిండా ఎంతో ఆనందం!

మరోరోజు సాయంత్రం నేను బజారునుండి కూరల సంచితో హడావుడిగా లోపలికి వస్తూ హాలులో పూలు గ్రుచ్చుకుంటున్న కామాక్షిని చూచి ఇలా అన్నాను.

"కామాక్షి, అసలు అందమంటే బెంగాలీ ఆడవాళ్లదే అందమనుకో. అబ్బ వాళ్ళందం చూడటానికి వెధవ ఈరెండుకళ్లూ చాలవనుకో—"

కామాక్షి తలఎత్తి నావంక చురుగ్గా చూచింది.

"ఆహా.. ఏమీలేదు. బజారుకు కూరలకని

వెళ్ళానా? ఒక బెంగాలీయువతి కూడ కూరలు బేర మాడి కొంటుంటే అబ్బ ఎంత వండర్‌ఫుల్‌గా వుందని. అసలు ఆ వంటిరంగు— అబ్బ, తెలుపుకాదు, పసుపూకాదు, ఎరుపు అంతకంటే కాదు.......గులాబి వన్నె. నోనో, అదికాదు. అసలారంగు ఇంతా అని చెప్పలేని తళుకు, ఒకవిధమైన కాంతి. నాకు తెలియకడుగుతా కామాక్షీ, వాళ్ళు ఏం తింటారంటావు అలా వుంటారు?"

"ఏం తింటారా! వచ్చిగడ్డి లేదూ! అదితింటారు. మీరూ రోజూ ఒక మోపు వేయించుకుని తినండి. మీకూ ఆ రంగువస్తుంది." అని తకీమని సమాధానం చెప్పి బాణంలాగా గదిలోకి వెళ్ళిపోయింది.

నాకు మా ఆఫీసరు సీట్లో అచ్చంగా ఎప్పటికీ కూర్చున్నంత సంతోషం కల్గింది.

నేను బట్టలు మార్చుకుని లుంగీ కట్టుకుని గది లోకివచ్చాను. కామాక్షి మంచంమీద గోడవయిపుకు తిర్గి పండుకుంది.

నేను, "ఎందుకు కామూ, ఈ వేళప్పుడు పండు కున్నావూ?" అని అంటూ మంచంపట్టెమీద కూర్చునేసరికి కామాక్షి విప్పునలేచి సర్రున నా చేతి కందకుండా బయటికి వెళ్ళిపోయింది.

అప్రయత్నంగా నా చూపులు మంచంమీదున్న దిండువయిపుకు మళ్ళాయి. దిండువాళ్ళు అంగుళాల మేర తడిసివుంది. మంచంమీద కూర్చుని దిండును వొళ్ళోకి తీసికున్నాను. కామాక్షి వేడికన్నీరుతో తడిసిన చోట నా పెదాలు ఆనించాను. మరిచెప్పటి స్పర్శ — డియర్‌కామూ— మైడియర్ కామూ! నీవు నన్నెంత గాఢంగా ప్రేమిస్తున్నావో నాకు తెలియదను కుంటున్నానా? నాకుతెల్సు కామూ! నేనిలా పరాయి స్త్రీల అందం నీ దగ్గరపొగిడి నిన్ను బోర్ కొట్టిస్తున్నానంటే నీమీది అసహ్యంతో కాదు. నీవంటే ప్రేమలేక కాదు. కేవలంమిదొక ప్రయోగం. చిన్న తమాషా. మరి నేను కథ రాయవద్దూ....

.....ఇలా వీలున్నప్పుడల్లా శ్రీమతి దగ్గర పరాయి ఆడవాళ్ళ అందచందాలను గురించి పొగుడుతూనే వున్నాను. అలా పొగిడినప్పుడల్లా కామాక్షిలో కోపం బుసలు కొట్టుతూనే వుంది. అలా కోపం బుసలు కొట్టినప్పుడల్లా ఆమెలో వింత అందాలను చూస్తూ వున్నాను. కామాక్షిలో కోపాన్ని రేకెత్తించి కొత్త అందాలను చూచినప్పుడల్లా నా కామూ నన్నెంత గాఢంగా ప్రేమిస్తోందనన్న భావం నాలో గర్వాన్ని మరింత వుత్సాహాన్ని కలిగిస్తుంది. నేను వ్రాయ దల్చుకున్న కథకు మనస్సులోనే ఒక రూపాన్నియిచ్చి త్వరలో కాగితం మీద పెట్టుదామను కుంటున్నాను.

ఇక్కడ ఒక విషయాన్ని గురించి చెప్పవల్సివుంటుంది. ఈమధ్య శ్రీమతిలో ఒక మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె పూటపూటకు రకరకాలుగా అతి అందంగా అలంకరించుకుంటుంది. ఇదంతా రోజు రోజుకు తనని దాటిపోతున్న నన్ను ఆకర్షించి అకట్టుకోవాలనే ప్రయత్నమని వేరే చెప్పనక్క లేదు. పాపం, ఇలాగయినా పరస్త్రీ సౌందర్య భూషణ మానుతానేమోనని శ్రీమతి తాపత్రయం! నేనెందుకు మానుతాను? దీనివలన నేనెంతో మానసికానందం పొందుతున్నానాయె! పయిగా శ్రీమతిలో కొత్త అందాలు, వింత ఆకర్షణలు చూసే అదృష్టం లభించిందాయె. మామూలు పరిస్థితుల్లో కామాక్షిని ఇలా అలంకరించుకోమంటే మాత్రం అలంకరించు కుంటుందా? సంసారపక్షం స్త్రీలకు అతిషోకులు పనికిరావని లోగడనోసార్లు అనివున్నది.

* * *

నేనీవిధంగా కామాక్షిని వుడికిస్తూ ఒక విధమైన మానసిక ఆనందాన్ని పొందుతూ నేను వ్రాయ దల్చుకున్న కథలో నా ప్రయోగ ఫలితాలను పొందుపర్చి అర్ధరాత్రి కథ వ్రాద్దామని అనుకుంటుండగా ఆరోజు సాయంత్రం ఒక సంఘటన జరిగింది.

నా స్నేహితుడు మోహన్ మాయింటికి వచ్చాడు, కనకదుర్గ గుడికెళ్ళివస్తూ దార్లోవున్న నన్ను పలకరించి పోదామని వచ్చాడంట. వాడారోజు కొత్తగా పంచెకట్టి బెంగుళూరు సిల్కులాల్చీ వేసుకున్నాడు. వాడి కొత్తవేషం నాకుచూపించాలని వాడి వుబలాటం.

కామాక్షి కాఫీలు యిచ్చింది. కాసేపు పిచ్చాపాటీ మాటాడి వాడిదారిన వాడు పోయాడు. పోతూ, "ఒరేయ్, నీవుకూడ సరదాగా ఒకరోజు పంచెకట్టి లాల్చీవేయరా!" అని అన్నాడు నవ్వుతూ.

వాడెళ్ళిన తర్వాత కామాక్షితో వాడన్నమాట చెప్పి, "సరదాగా ఒకసిల్కు పంచె కొంటాను." అని అన్నాను.

కామాక్షి వెంటనే అందుకుని, "ఆ— పంచె మీకేం బాగుంటుంది? కట్టేవాళ్ళు కట్టాలిగాని, అందరూ కట్టితే ఏం బాగుంటుంది. మీ స్నేహితుని కంటే అపర్ణనాల్టీకి, ఆ ఎత్తుకు లావుకు చాల చక్కగాను చూడముచ్చటగా వుంది—"అని అంది.

ఇక నేనేమీ మాటాడలేదు. నిజంగా ఈవేషం వాడికి బాగుండివుండవచ్చును. నిజానికి బాగుంది కూడ. కాని, ఆమాటనే నా భార్యనోటివెంట వింటుంటే నాకెలాగో అనిపించింది. పరాయి మొగవాడి డ్రెస్‌ను గురించి పర్సనాల్టీ గురించి కామాక్షి అంత అతిగా మాటాడటం నాకు చిరాకనిపించింది.

పయిగా కామాక్షి మళ్ళీ అంది. "నిజంగా మీ మోహన్ ఈ డ్రెస్‌లో చాల బాగున్నాడు కదండీ? అచ్చం ఎన్టీ రామారావులాగా వున్నాడు కదూ!"

ఏమిటామాటలు? నాకు మొదట అరికాలులో, ఆతర్వాత నడినెత్తిలో భుగభుగ కుతకుతమంది. కాని, నాకేమి అనటానికీ తోచలేదు. తలెత్తి సీరియస్‌గా చూశా. కాని అప్పటికే కామాక్షి వెనక్కి తిర్గిలోపలి కెళ్ళుతుంది. వెనుకనుండి చూస్తుంటే కామాక్షి ముసిముసిగా నవ్వుతున్నదేమో ననిపించింది. ఎందుకో ఆక్షణంలో నా గుండె అతినీరసంగా కొట్టుకుంది.

అర్ధరాత్రి వ్రాయాలనుకున్న కథను వ్రాయలేక పోయాను.

మర్నాటి సాయంత్రం నేను ఆఫీసునుండి యింటికి రాగానే, "యిప్పుడే మీకోసం ఎవరో వచ్చి వెళ్ళారు."అని అంది కామాక్షి.

నేను నవ్వుతూ, "ఎవరు, ఆడా, మగా?"అన్నాను కామాక్షి ఒక్కక్షణం ఆగి, "మగే—"అంది.

"మగవారా. ఎవరు? పేరడిగావా?"

"అడగలేదు."


"మనిషి ఎలా వుంటాడు?"

"ఎత్తుగా ఎర్రగా వున్నాడు. సినిమా హీరోపెర్సనాల్టీ. నొక్కుల క్రాపు. టెర్లిన్‌షర్టు లోపలేసుకున్నాడు. టై కట్టుకున్నాడు."

"ఎవరు సుందర్రావా?"

"ఆయన పేరు సుందర్రావా? నేనప్పుడే అనుకున్నా. అలాటి పేరేదో వుంటుందని. నిజంగా పేరుకు తగ్గట్టు సుందర్రావే! మనిషిని ఒక్కసారిచూస్తే యింకెప్పుడూ మర్చిపోము."

నాకు సర్రున కోపంవచ్చింది. సాక్షాత్తు చెట్టంత మొగుణ్ణి ఎదుట పెట్టుకుని పరాయి మొగాడి రూపు



అంతటి అన్నాలకటం అనిశక్తి కాకుందనసేనా? వెక్కుతి అత్తుర్ను కళ్ళల్లోకి తన్నాయి.

"పెళ్ళాంతో గోపిగాడొస్తే వాడిపేరు అడగకుండా వెధవ వర్ణనంత్నీ చేస్తావేం ?" అని విరాగ్గా అన్నాను.

కామాక్షి నామాట వినలట్లు మళ్ళీ, "అతనికి పెళ్ళయిందా అండీ? నిజంగా అంత అందగాణ్ణి భర్తగా పొందిన ఆయనభార్య ఎంత అదృష్టవంతురాలో!" ఏదో పత్తుగాలోంచి స్వైరంగా అంటున్నట్టుగా అంది.

తీనికి పిచ్చం ఎక్కలేదు గదా? ఇవాళ ఇలా మాటాడుతుందేమిటి?

సిగ్గు. సిగ్గు. మొగవాడన్న వాడికెంత సిగ్గుచేటు విషయం. పురుషలోకానికే తలవంపులు!! నా పెళ్ళాం నాముందు పరాయి మొగవాణ్ణి, వాడి రూపాన్ని పొగడటమా? నారక్తం కుతకుత వుడుకుతుంది. నేనికె సహించలేను. నా పురుషత్వపు హుంకారాలు పెట్టుతుంది. నేను మొగవాణ్ణి, మొగుణ్ణి! మంటలు—మంటలు— మంటలు— వళ్ళంతా అగ్ని మంటలు.

"వెధవ వాగుడు వాగక—" అని అంటుండగా నా ప్రయత్నం లేకుండానే నా కుడిచేయి పయికి లేచింది.

"ఏం?" అంది కామాక్షి ధైర్యంగా, రోషంగా, కసిగా, సవాలుగా.

నాభార్యను అలా చూడగానే పైకిలేచిన నాచేయి తెలియకుండానే అలాగే ఆగిపోయింది.

# భార్యాభర్తలెలా...

కామాక్షి కంటినిండా నీరుపు అలుముకుంది కోపంతో రొప్పుతూ వుంది.

"సుందరంగారు అందంగా వున్నాడు. గోపి అందంగా వున్నాడు. మీకంటే వెయ్యిరెట్లు, లక్షరెట్లు అందంగా ఉన్నాడు. అందుకే అంటున్నా, ఆతని భార్య అదృష్టవంతురాలని. అందం అనేది అందరూ మెచ్చుకునేదని ఒకప్పుడు మీరన్న మాటేగా. మీకందంగా కనిపించిన ఆడవాళ్ళని గురించి నాముందు తెగ పొగడటంలా. నేనూ అంతే! నాకందంగా కనిపిస్తే పరాయి మొగవాడినయినా పొగుడుతా— పొగుడుతా — అంతగా వినలేకపోతే చెవులు మూసుకోండి....." కామాక్షి చివరిమాటలు ఏడుపుగా మారాయి. ఇక మాటాడలేకపోయింది. తనమనసు కంట్రోల్ చేసుకోలేక రోషంతో రొప్పుతూ గదిలోకి వెళ్ళిపోయింది.

నేను తలపట్టుకుని కుర్చీలో చతికిల పడ్డాను.

ఇది నేను ముందుగా వూహించని సన్నివేశం! ఏంత పరిణామం! మొగవాడు, మొగుడయినవాడు భరించలేని విషయం. నా ప్రయోగం నాకే ఎదురుకొట్టు పడింది.

నాభార్య కామాక్షి ఎందుకిలా అయిపోయింది ? కొంపదీసి నా భార్యకు నామీద ప్రేమనిండుకోలేదు కదా! నానుండి అన్ని రకాల సుఖాలనందుకుంటున్న కామాక్షికి ఏమయిందో, ఈవిధంగా మాట్లాడటమేమిటి? మంచిలాటి వంశంలో పుట్టిన కామాక్షి, మంచిలేని వంశంలో మెట్టిన కామాక్షి. ఇక నేనే నా ఆలోచించలేకపోయాను. నా ఆలోచనలు, మనస్సు అన్నీపూర్తిగా 'బ్లాంక్' అయిపోయాయి.

అట్టాలయినా చూర్చుకోకుండా మంచంమీద పడుకున్నాను. గదినిండా చీకటి. మనస్సంతా చీకటి. అలా ఎంతసేపు పడుకున్నానో!

"అన్నం వడ్డించా. ఇక భోజనానికి లేవండి"— గదిలోంచి పెంటు బాలా వాసన.

"అక్కర్లా—" కోపంగా అన్నాను.

నా భుజంమీద చేయివేసి కామాక్షి నామీదకు వంగి నన్ను తన వయిపుకు తిప్పుకుంది. కామాక్షి అప్పుడే పెట్టుకున్న కాటుకలోని పచ్చకర్పూరపు వాసన నా ముక్కుకు ఘాటుగా తగిలింది.

"కోపం వచ్చిందా?"— ముద్దుగా గారాబంగా అడిగింది.

నేను మాట్లాడలేదు.

"మరి వాడగ్గర పరాయి ఆడవాళ్ళ అంద చందాలను గురించి వూరికే అలా పొగుడుతుంటే నాకు మాత్రం కోపంరాదా? బాధగావుండదా? మీరు విజానికే అన్నా, నవ్వులాటలకన్నా మీరలా ఇంకో ఆడదాన్ని గురించి మాటాడుతుంటే నేనెంత కుమిలిపోయానో తెలుసా? నేనెంత మనస్సు కోత ననుభవించానో మీకు తెలియదు. మీకూ తెల్సిరావటానికే నేనూ మీ స్నేహితుల గురించి ఆసక్తి చూపాను. వాళ్ళ అందాన్ని పొగిడాను. అందుకు మీరెంతబాధ పడుతున్నారో చూడండి!

"చదువుకున్నవారు, అన్నీ తెల్సినవాళ్ళు మీకు చెప్పాలా? ఇలా భర్త పరస్త్రీలను గురించి భార్య పర పురుషులను గురించి ఆసక్తిచూపి వరుల అంద చందాల ఆకర్షణలో పడికొట్టుకుపోతుంటే ఇక ఈ పవిత్రబంధాలెలా నిలుస్తాయి? భగవంతుని సంకల్పం వల్లనో మన పెద్దల నిర్ణయం వల్లనో ఎలాగో మనం భార్యాభర్తలయ్యాం. నన్ను తలదన్నిన అందగత్తెలు, మిమ్మల్ని మించిన అందగాళ్ళు లోకంలో ఎంతోమంది వుంటారు. అలాగని మనం సౌందర్యాకర్షణలో పడి హద్దులు మీరితే యిక పెళ్ళిళ్ళు ఎందుకు? ప్రేమ లెందుకు?........"

ఇక నేనేం మాటాడుతాను? ఏ మొగుడయినా ఏం మాటాడుతాడు?

కామాక్షిని దగ్గరకు లాక్కొని ఆమె గుండెల మీద తలపెట్టుకున్నప్పుడు నేను కథ రాద్దామనుకున్న విషయం గుర్తుకు వచ్చింది.

నా సౌందర్య ఇక కథ ఏం రాస్తాను?

